సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 16 । జూలై । 2023



గుడిసెల తొలగింపు

అలంపూర్ చౌరస్తాలో కళాకారుల గుడిసెల తొలగింపు వివాదాస్పదమైంది.

వివరాలు 8లో ▸



మల్లెలకుంట పరిశీలన

దేవరకద్ర మల్లెల పాపయ్య కుంట చెరువును శనివారం అధికారులు పరిశీలించారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /21.9

వాతావరణం

ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

వట్టిపోతున్న ఆశలు

వానాకాలం మొదలై నెలరోజులు దాటినా కనిపించని వాన



అడుగంటిన జూరాల జలాశయం

- అడుగంటిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు
- ప్రస్తుతం జలాశయంలో అందుబాటులో ఉన్నది 2.297 టీఎంసీలే
- అదను దాటుతుండటంతో అన్నదాతల్లో ఆందోళన
- ఉమ్మడి జిల్లాలో తీవ్రమవుతున్న సాగు, తాగునీటి కష్టాలు

గద్వాల రూరల్: వానాకాలం మొదలై 40 రోజులు గడిచినా.. వాన జాడ లేకుండాపోయింది.. దీంతో కృష్ణాబేసిన్ పరిధిలో రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టు అయిన జూరాల జలాశయం అడుగంటిపోయింది.. మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది. వాస్తవానికి వర్షాకాలంలో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతంలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరదనీరు వచ్చి చేరి నిండిన తర్వాత దిగువనున్న జూరాల నిండుతుంది. అయితే ఈసారి వర్షాల జాడే లేకపోవడంతో ఇప్పటి వరకు జూరాలకు ఎగువ నుంచి చుక్క వరద నీరు రాలేదు. ప్రాజెక్టు పరిధిలో కురిసిన వర్షాలతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కేవలం అర టీఎంసీ కంటే తక్కువ నీరు వచ్చి చేరిందంటే పరిస్థితిని ఊహించవచ్చు. దీంతో జూరాలపై ఆధారపడి ఉన్న నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. మరోవైపు దిగువనున్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల పరిస్థితి ఇదే తరహాలో ఉంది.

అలాగే తుంగభద్ర బేసిన్ పరిధిలోని 87 వేల ఎకరాలకుపైగా ఆయకట్టున్న ఆర్డీఎస్ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇప్పటి వరకు తుంగభద్ర బేసిన్‌లో వరద లేకపోవడంతో జిల్లాలోని తుమ్మిళ్ల ఎత్తిపోతలు (ఆర్డీఎస్) కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు ఆందోళన కలిగిస్తుంది.

ఎత్తిపోతలకు కష్టాలే..

కృష్ణా బేసిన్ పరిధిలో జూరాలపై ఆధారపడి ఉమ్మడి జిల్లాలో నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతలు నిర్మించారు. ఆయా ప్రాజెక్టుల కింద ఏటా సుమారు 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ముఖ్యంగా శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం ఉన్నప్పుడు బ్యాక్‌వాటర్ నుంచే కేఎల్ఐ ద్వారా నీటిని ఎత్తిపోసి 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తున్నారు. అలాగే జూరాల ప్రాజెక్టు కింద కుడి ప్రధాన కాల్వ పరిధిలోని జోగుళాంబ గద్వాల జిల్లా, ఎడమ ప్రధాన కాల్వ పరిధిలో మక్తల్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని లక్ష ఎకరాలకు, భీమా ఎత్తిపోతల పరిధిలో 1.50 లక్షల ఎకరాలకు, నెట్టెంపాడు ఎత్తిపోతల కింద 1.20 ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల కింద జూలై, ఆగస్టు నెలల్లో పంటల సాగు పూర్తవుతుంది. ఈ రెండు నెలల పాటు పంటలకు అవసరమైన నీటిని అందించాలంటే కనీసం 25 టీఎంసీలు కావాలి. కానీ, ప్రాజెక్టులు వట్టిపోవడంతో రైతన్నల్లో సాగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అలాగే తుంగభద్ర బేసిన్ పరిధిలో కూడా తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వరద లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతల (ఆర్డీఎస్) కింద సుంకేసుల నుంచి వరద ప్రవాహాన్ని ఎత్తిపోసి 50 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే పరిస్థితి లేకుండాపోయింది.

గతేడాదికి భిన్నంగా..

గతేడాది జూన్ నెలాఖరుకే జూరాలకు పెద్ద ఎత్తున వరద వచ్చి జలకళ సంతరించుకుంది. దీంతో అధికారులు ఉమ్మడి జిల్లా పరిధిలోని కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల ప్రాజెక్టుల కింద జూలై మొదటి వారంలోనే పంటల సాగుకు అవసరమైన నీటిని విడుదల చేశారు. కానీ, ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఎగువ భాగాన మహారాష్ట్ర, కర్ణాటకలోని ప్రాజెక్టుల నుంచి వరద లేకపోవడంతో పంటల సాగుకు అదను దాటిపోతుంది. మరోవైపు మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతన్నలను కాపాడుకునేందుకు ఖరీఫ్, రబీ సీజన్లను నెల రోజులు ముందుకు సర్దుబాటు చేయాలన్న సర్కారు నిర్ణయానికి కూడా ప్రస్తుత పరిస్థితులు అడ్డంకిగా మారాయి.

పదేళ్లలో ఇదే మొదటిసారి..

వానాకాలం సీజన్ మొదలై నెలరోజులు గడిచినా కృష్ణా బేసిన్ పరిధిలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో ఉమ్మడి జిల్లాలో ఈ బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులకు వరద లేకుండా పోవడం గడిచిన పదేళ్లలో ఇదే మొదటిసారి. దీంతో ఉమ్మడి జిల్లా పెద్దన్నగా పేరున్న జూరాలలో నీటినిల్వ డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.14 టీఎంసీల నీరు ఉన్నా.. సీల్టు పోగా.. కేవలం 2.297 టీఎంసీల నీళ్లు మాత్రమే అందుబాటులో ఉంది. ఈ సీజన్‌లో ప్రాజెక్టు పైభాగాన కురిసిన తేలికపాటి వర్షాలతో ఇప్పటి వరకు 0.41 టీఎంసీల నీరు మాత్రమే చేరింది. ఇలాంటి పరిస్థితి గత పదేళ్లలో ఎప్పుడూ తలెత్తలేదు.

2022, 2023 ఏడాది జూలై 14 వరకు ప్రాజెక్టులలో అందుబాటులో ఉన్న నీరు (టీఎంసీలలో)

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం	2022	2023
ఆల్మట్టి	129.72	91.90	22.80
నారాయణపూర్	37.64	33.38	17.41
జూరాల	9.96	5.18	6.14
శ్రీశైలం	215.81	44.74	33.72



కృష్ణా బ్రిడ్జి వద్ద వెలవెలబోతున్న కృష్ణమ్మ

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ దోత్రే



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే శనివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్ రవినాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా ఉన్న దోత్రే బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధి కోసం చేస్తున్న పనులను సమర్థవంతంగా అమలు చేస్తానని వివరించారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రేను ఆయన క్యాంప్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణికుమారి తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పూలబొకేను అందజేశారు.

సీతారామారావు బదిలీ

రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.మోహన్‌రావు జిల్లాకు రానున్నారు. సీతారామారావును వెయిటింగ్‌లో ఉంచారు.

దీర్ఘకాలిక కేసులపై దృష్టి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో దీర్ఘకాలంగా ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, పీటీ కేసులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. ఎస్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జిల్లా నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ల వారీగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలు తగ్గించడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, సీసీ కెమెరాలు ఏర్పా టు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వాగులు, చెరువుల దగ్గర నీరు ప్రవహిస్తున్న ప్రదేశాల్లో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గత నెలలో జిల్లాలో వర్టికల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీలు మహేష్, రమణారెడ్డి, సీఐలు సైదయ్య, ప్రవీణ్‌కుమార్, స్వామిగౌడ్, రమేష్ బాబు, రజితరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు రీసెర్చ్ ఫెసిలిటీ సెంటర్‌కు శంకుస్థాపన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా నిర్మించనున్న సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ భవనానికి ఆదివారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేస్తారని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని నిర్మాణం వలన పీయూలో విద్యార్థులకు రీసెర్చ్‌పై మరింత అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులను భర్తీచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ కళాశాలలు, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎంవీఎస్ కళాశాల వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు లేని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 864 ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం మూసివేసిందని, వెంటనే వాటిని తెరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలు, యూనివర్సిటీ భూములను కాపాడాలని, గురుకులాలకు పక్కా భవనాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మహేష్, దినేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌ను బైపాస్‌తో కలుపుతాం



బైపాస్‌పై సెంట్రల్ లైటింగ్ పనులకు భూమిపూజ చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

- 23న మినీ ట్యాంక్‌బండ్ వద్ద మెగా డ్రోన్ షో: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలోనే దివిటిపల్లి నుంచి ఐటీ టవర్ మీదుగా బైపాస్ ద్వారా పట్టణానికి చేరుకునేందుకు మరో రోడ్డు నిర్మిస్తామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఐటీ, ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఈ బైపాస్‌తో కలుపుతామన్నారు. జిల్లాకేంద్రంలోని ఎదిర చౌరస్తా నుంచి క్రిష్టియన్‌పల్లి శివారు వరకు బైపాస్‌రోడ్డుపై రూ.1.76 కోట్లతో ఏర్పాటుచేసే సెంట్రల్ లైటింగ్ పనులకు శనివారం భూమి పూజ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానికుల కల అయిన బైపాస్‌ను నిర్మించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. దీనికి ఇరువైపులా ఫుట్‌పాత్ (వాకింగ్ ట్రాక్) సైతం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం జడ్చర్ల, భూత్పూర్ నుంచి వేర్వేరుగా మహబూబ్‌నగర్ చేరుకునేందుకు ఫోర్ లైన్ రోడ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. క్రిష్టియన్‌పల్లి నుంచి పాలమూరు యూనివర్సిటీ మీదుగా చిన్నదర్పల్లి వరకు మరో బైపాస్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం మినీ ట్యాంక్‌బండ్ వద్ద 450 డ్రోన్లతో మెగా షో నిర్వహిస్తామన్నారు. ఆరోజు పట్టణ ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి అద్భుతమైన ఈ షోను తిలకించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ పర్యాటక క్షేత్రాలు, ముఖ్యమైన ప్రదేశాలను డ్రోన్ షో లైటింగ్ ద్వారా వీక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవినాయక్, డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ కె.వెంకటయ్య, ముడా చైర్మన్ గంజి వెంకన్న, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, జిల్లా గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు శాంతన్నయాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్లు వనజ, ముషా నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు



వీసీ నిర్వహిస్తున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శనివారం ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా వివిధ ఫారాల కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ఫారం 6, 7, 8 కింద వచ్చే వాటన్నింటిని ఏ రోజుకారోజు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితా నుంచి తొలగింపు ప్రక్రియను పూర్తి జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ప్రతి తొలగింపునకు కచ్చితమైన రికార్డును భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఈఆర్‌ఓలు పోలింగ్ కేంద్రం వారీగా ఫారాలకు సంబంధించి కొత్త నమోదు, తొలగింపులు అన్నింటిపై వివరాలు సమర్పించాలన్నారు. ఓటరు జాబితాలో పొరపాటుగా నమోదైన వాటి తొలగింపుపై మరోసారి ఈఆర్‌ఓలు దృష్టిసారించాలని చెప్పారు. కొత్త దరఖాస్తులు, అభ్యంతరాలను ప్రతిరోజు పరిష్కరించడం, అన్ని ఫారాలను జాగ్రత్తగా పరిశీలించి రికార్డు చేయడం, జనవరి 2022 నుంచి జనవరి 2023 వరకు ఓటరు జాబితాలో తొలగింపునకు సంబంధించి పరిశీలన అప్రమత్తంగా చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మారిన వారిపై ఎక్కువ దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేష్ దోత్రే, సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, జెడ్పీసీఈఓ జ్యోతి, డీఆర్డీఓ యాదయ్య, డీపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు టిఫిన్ డబ్బా ఇష్టాగోష్టి

పాలమూరు: బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలోని మయూరీ పార్క్‌లో టిఫిన్ డబ్బా ఇష్టాగోష్టి నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి హాజరవుతారన్నారు. ఇష్టాగోష్టి కార్యక్రమానికి వచ్చే ప్రతిఒక్కరూ ఇంటి నుంచి టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ తీసుకురావాలని సూచించారు.

సీనియార్టీ ప్రకారం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీనియార్టీ ప్రకారం ఇవ్వాలని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం తన చాంబర్‌లో నిర్మాణ పనులు, ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెటీరియల్ కొరత లేకుండా చూడాలన్నారు. వర్షాలు ఆలస్యమైనందున విద్యుత్ డిమాండ్ పెరిగిందని, ఈ క్రమంలో సబ్‌స్టేషన్ల నుంచి సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. పీఆర్ ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల్లో వేగం పెంచడంతోపాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా ఎప్పటికప్పుడు నీటిని సరఫరా చేయాలని, గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతు చేయించాలని ఆదేశించారు. అలాగే సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని చైర్మన్ కల్యాణి నిర్వహించారు. ఆయా సమావేశాల్లో జెడ్పీసీఈఓ జ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శశిరేఖ, పీఆర్‌ఈఈ నరేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈ చంద్రమౌళి, బీసీ సంక్షేమాధికారి ఇందిర, మైనార్టీ అధికారి టైటస్‌పాల్, ఎస్సీ సంక్షేమాధికారి పాండు పాల్గొన్నారు.

బలాన్‌పల్లి శివారులోని సూర్యనారాయణస్వామి ఆలయం



బలాన్‌పల్లిలో భాస్కర క్షేత్రం



సూర్యనారాయణస్వామి విగ్రహం

- రాష్ట్రంలోనే రెండో సూర్య నారాయణస్వామి ఆలయంగా భావిస్తున్న చరిత్రకారులు
- నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బలాన్‌పల్లి ఆలయానికి 500 ఏళ్ల చరిత్ర
- ఆలయ పరిసరాల్లో అరుదైన శిల్పాలు
- గుప్తనిధుల తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోతున్న వైనం

సండే స్పెషల్


సాక్షి, నాగర్‌కర్నూల్ /తాడూరు: సూర్యుడి పేరిట దేవాలయాలు ఉండటం అత్యంత అరుదుగా చూస్తుంటాం. అలాంటి అరుదైన సూర్యనారాయణుడి ఆలయం నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం బలాన్‌పల్లిలో కొలువుదీరడం విశేషంగా నిలుస్తోంది. సూర్యనారాయణుడు ఇక్కడ స్వయంభుగా కొలువుదీరడం అరుదైన విషయమని చరిత్రకారులు చెబుతున్నారు. ఏడు గుర్రాలు వాహనంగా, ఛాయాదేవీ, సంధ్యాదేవి సమేతంగా సూర్యభగవానుడు స్వయంభుగా వెలసిన విగ్రహం రాష్ట్రంలో ఎక్కడా కన్పించదని పేర్కొంటున్నారు. ఇన్నాళ్లు గ్రామస్తులు ఈ ఆలయాన్ని చెన్నకేశవ ఆలయంగా భావించి పూజలు నిర్వహిస్తుండగా, మూడేళ్ల కిందటే దీనిని సూర్యనారాయణుడి ఆలయంగా గుర్తించడం గమనార్హం. ఇలాంటి పురాతన ఆలయాన్ని సంరక్షించి ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేయాలన్న అభిప్రాయం స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది.

వెలుగులోకి రాని ఆలయం..

రాష్ట్రంలోనే అరుదైన సూర్యనారాయణుని ఆలయం ఇన్నాళ్లుగా వెలుగులోకి రాకుండా పోయింది. ఏళ్ల పాటు ఈ ఆలయాన్ని చెన్నకేశవస్వామి ఆలయంగా భావించిన స్థానికులు ఆ పేరుతోనే పిలుచుకున్నారు. ఇక్కడి సమీపంలోని చెరువును సైతం చెన్నకేశవ చెరువుగా గ్రామస్తులు పిలుస్తున్నారు. అయితే నాలుగేళ్ల కిందట గ్రామానికి వచ్చిన పరిశుద్ధానందస్వామి ఈ విగ్రహాన్ని పరిశీలించి సూర్యనారాయణుడిగా తేల్చారు. అప్పటి నుంచి గ్రామస్తుల సహకారంతో శిథిలమైన ఆలయ శిఖరాన్ని మళ్లీ నిర్మించారు. తమ చేనులో సూర్యనారాయణుడు కొలువుదీరడంతో ఆ భూమి యజమాని మాదాసు యాదయ్య సైతం ఎకరం భూమిని ఆలయ అభివృద్ధి కోసం కేటాయించారు. ఏటా రథసప్తమి సందర్భంగా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆదివారాల్లో మాత్రమే ఇక్కడి సూర్యనారాయణుడు పూజలందుకుంటున్నాడు. దేశవ్యాప్తంగా ఆరుచోట్ల మాత్రమే సూర్యుడి కోసం ఆలయాలు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ దేవాలయం, జమ్ముకశ్మీర్‌లో మార్తండ సూర్యదేవాలయం, గుజరాత్‌లో మోఢేరా దేవాలయం, ఆంధ్రప్రదేశ్‌లో అరసవల్లి సూర్యనారాయణ ఆలయాలు మాత్రమే ఉన్నట్టు ప్రాచుర్యం పొందగా, రాష్ట్రంలో బలాన్‌పల్లిలోని సూర్యనారాయణుని ఆలయం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలోని సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం తిమ్మాపురంలో సూర్యనారాయణస్వామి ఆలయాన్ని నిర్మించగా, స్వయంభుగా కొలువైన సూర్యనారాయణ ఆలయాలు అరుదుగా కన్పిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంపై మరింత పరిశోధన జరిపి, అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయం చెంత అపురూప విగ్రహాలు

తాడూరు మండలం బలాన్‌పల్లి శివారులోని పంటపొలాల్లో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయం సుమారు 500 ఏళ్లకు ముందు నుంచే ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడి ప్రధాన ఆలయంలో సూర్యనారాయణుడు ఏడు గుర్రాలను వాహనంగా చేసుకుని, ఛాయాదేవి, సంధ్యాదేవి దేవతామూర్తులతో సహా కొలువుదీరారు. ఆలయం పైకప్పు భాగంలో అష్ట దళ పద్మం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయం ఉత్తరాశి (ప్రవేశ ద్వారం)మీద గజలక్ష్మి శిల్పం, ఏనుగులు చెక్కి ఉన్నాయి. ఆలయానికి ఎదురుగా రాతి ధ్వజస్తంబం ఉండగా, అభిముఖంగా పురాతన కాలంనాటి శివాలయానికి చెందిన ఆనవాళ్లు ఉన్నాయి. ఆలయ గోడలు పూర్తిగా ధ్వంసం కాగా పురాతన శివలింగం, శిథిలావస్థలో ఉన్న నందివిగ్రహం, అపురూపమైన ద్వారపాలకులు, భైరవుడి విగ్రహాలు మిగిలి ఉన్నాయి. కుడిచేతిలో గద, ఎడమ చేతిలో పాము, ఢమరుకం, చక్రం ధరించిన ద్వారపాలకుడి విగ్రహం స్పష్టంగా కన్పిస్తోంది. గతంలో గుప్తనిధుల కోసం దుండగులు జరిపిన తవ్వకాల్లో శివాలయం పూర్తిగా ధ్వంసం కాగా శిథిలాల ఆనవాళ్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.



ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..



మా గ్రామంలో ఏళ్ల కాలం నుంచి ఈ ఆలయం ఉంది. మొదట చెన్నకేశవ స్వామిగా భావించగా, ఇటీవల సూర్యనారాయణస్వామిగా తెలిసింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చొరవ తీసుకోవాలి. ఇక్కడి చరిత్ర, ఆలయ ప్రాముఖ్యతపై పరిశోధన జరగాలి.

– వెంకటస్వామి, బలాన్‌పల్లి, తాడూరు మండలం

రాష్ట్రంలో అరుదైన ఆలయం..



బలాన్‌పల్లిలోని సూర్యనారాయణస్వామి విగ్రహం అత్యంత అరుదైనది. రాష్ట్రంలో ఎక్కడా ఇలాంటి విగ్రహం కన్పించదు. ఏడు గుర్రాలు, ఛాయాదేవి, సంధ్యాదేవి సమేతంగా సూర్యనారాయణుడు కొలువై ఉన్నాడు. ఇలాంటి అపురూప విగ్రహాలు ప్రభుత్వం సంరక్షించి, పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ప్రభుత్వం స్పందించి వెంటనే సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

– రెడ్డి రత్నాకర్‌రెడ్డి, చారిత్రక పరిశోధకుడు

నిరాదరణగా కాటమయ్య విగ్రహం



పంటపొలాల్లో పడిఉన్న కాటమయ్య విగ్రహం, పాదాలు



సూర్యనారాయణస్వామి ఆలయానికి సమీపంలోని పంటచేళ్లలో కాటమయ్య విగ్రహంగా భావిస్తున్న అపురూప విగ్రహం నిరాదరణగా పడి ఉంది. ఎడమ చేతిలో ఖడ్గం, కుడి చేతిలో కొడవలి, బొడ్డు సమీపంలో మరో కత్తి, గుర్రంపై దౌడు తీస్తున్నట్టుగా ఉన్న ఈ విగ్రహం సమీపంలో విసిరేసినట్టుగా పాదాలు సైతం ఉన్నాయి. ప్రధానంగా యాదవులు, గొర్రెల కాపరులు కాటమయ్యను ఆరాధిస్తారని చరిత్రకారుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి చెబుతున్నారు. అయితే ఈ విగ్రహం రాణి రుద్రమదేవి రూపాన్ని పోలి ఉండటంతో స్థానికులు రుద్రమదేవిగా పిలుచుకుంటున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం


వినోద్‌కుమార్ (ఫైల్)

మదనాపురం : క్షణికావేశంలో యువకుడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని గోవింద హళ్లీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మురళీ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చుక్క వినోద్ కుమార్ (22) ఇంట్లో ఎలాంటి పని చేయకుండా మద్యం తాగుతూ జులాయిగా తిరిగేవాడు. ఎంత కాలం తిరుగుతావని, ఎదైనా పని చూసుకోమని ఇంట్లో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనోవేదనకు గురై గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో వేపచెట్టుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పరిగెత్తుకుంటూ వచ్చారు. చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఈ విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఆత్మకూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అతని అన్న గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పౌల్ట్రీ పరిశ్రమలో కార్మికుడి మృతి

బాలానగర్ : మండల పరిధిలోని పెద్దరేవల్లి గ్రామ శివారులోని పౌల్ట్రీ పరిశ్రమలో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దరేవల్లి గ్రామ శివారులోని పౌల్ట్రీ పరిశ్రమలో నాలుగేళ్లుగా నవాబ్‌పేట్ మండలం తీగలపల్లి గ్రామానికి చెంది పవన్ (55) పనిచేస్తున్నాడు. అతను ఉదయం బాత్‌రూంకి వెళ్లి మృతిచెందాడు. బాత్‌రూంలో గుండెపోటు రావడం వల్ల మృతి చెందిఉంటాడని బావిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గొడ్డలితో దాడి చేసిన దాయాది: కేసు నమోదు


పాన్‌గల్: దాయాదుల దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గొర్రైలకాపరి రాందాసు శుక్రవారం రాత్రి గొర్రైల వద్దకు వెళ్తుండగా పాలివాడైన శ్రీశైలం గతంలోని భూతగాదాలను దృష్టిలో ఉంచుకొని గ్రామ శివారులో గొడ్డలితో రాందాసుపై దాడి చేశాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు అంబులెన్స్‌లో జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తీసుకెళ్లాలని చెప్పడంతో తరలించారు. ఈ సంఘటనపై బాధితుని తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


బాలరాజు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. మద్దూర్ మండలం గట్టురెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలరాజు(29) మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ, మహీంద్రా షోరూంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి మూడు రోజుల క్రితం పెళ్లి సంబంధం కూడా చూశారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున దివిటిపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని రైల్వే ఎస్‌ఐ తెలిపారు. ఈ కేసును టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నీలి కిష్టారెడ్డి (ఫైల్)

నారాయణపేట రూరల్: పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కొల్లంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాల్‌రెడ్డికి గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. శనివారం తెల్లవారుజామున పంటకు నీరు పెట్టేందుకు కుమారుడు నీలి కిష్టారెడ్డి (34)ని పంపించాడు. బోరు మోటారు ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గుర్తించిన పక్క పొలం రైతులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నీలి కిష్టారెడ్డి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కళాకారుల గుడిసెలు తొలగింపు

- స్థల విషయంపై ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
- భూమి హౌసింగ్ బోర్డు ఆధీనంలోకి వెళ్లిన వైనం
- ఇటీవల అలంపూర్ చౌరస్తా సమీపంలో తాత్కాలిక గుడిసెల ఏర్పాటు
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగింపు
- తెల్లవారుజామున భారీగా పోలీసుల మొహరింపు.. స్థానికంగా కలకలం


అలంపూర్ చౌరస్తాలో రంగస్థల కళాకారుల గుడిసెలను తొలగిస్తున్న జేసీబీ

అలంపూర్/ఉండవెల్లి: స్థల విషయమై ఏళ్లుగా భూయజమానికి, కళాకారులకు మధ్య వివాదం, కోర్టులో కేసు కొనసాగుతూ రావడం.. కాలక్రమేణా ఆ స్థలం హౌసింగ్ బోర్డు పరిధిలోకి వెళ్లడం.. సదరు స్థలంలో ఇటీవల కళాకారులు తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకోవడం జరిగిపోయాయి. ఈ క్రమంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున భారీగా పోలీసులు మొహరించి మొత్తం గుడిసెలు తొలగించడంతో అలంపూర్ చౌరస్తాలో కలకలం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా..

భూ యజమాని, కళాకారులకు వివాదం

2001లో నియోజకవర్గంలోని రంగస్థల కళాకారులు అలంపూర్ చౌరస్తాలోని 261/ఆ సర్వే నంబర్‌లో నజీరున్నీసా బేగం అనే పట్టాదారు నుంచి 2.20 ఎకరాల స్థలం రూ.లక్షకు కొనుగోలు చేసినట్లు సమాచారం. పట్టాదారుకు ఈ స్థలానికి సంబంధించి రూ.40 వేలు బాకీపడ్డారు. దీంతో పట్టాదారుకు, రంగస్థల కళాకారుల మధ్య వివాదం నెలకొని కోర్టు వరకు వెళ్లారు. దీంతో పట్టాదారు అలంపూర్ కోర్టును ఆశ్రయించారు. అక్కడ కళాకారులకు అనుకూలంగా తీర్పు వెలువడింది. అనంతరం పట్టదారు జిల్లా కోర్టును ఆశ్రయించారు. జిల్లా కోర్టులో పట్టాదారుకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. రంగస్థల కళాకారులు హైకోర్టును ఆశ్రయించగా ఆ వివాదం తటస్థంగా ఉండింది. కొంత కాలం తర్వాత రంగస్థల కళాకారులు, పట్టాదారు పెద్దల సమక్షంలో రాజీకుదుర్చుకున్నట్లు సమాచారం. కేసు వెనక్కి తీసుకొని అందులో కళాకారులకు 1 ఎకరా 75 సెంట్లు, పట్టాదారుకు 75 సెంట్లు చెందే విధంగా ఒప్పందం కుదిరి దాదాపు 70వరకు తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేసుకున్నారు. దానికి కేసీఆర్ కాలనీ అని పేరు పెట్టగా ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఉన్నతాధికారుల ఆదేశం.. గుడిసెల తొలగింపు

అయితే కళాకారుల గుడిసెలు ఏర్పాటు చేసుకున్న స్థలం హౌసింగ్ బోర్డుకు చెందినదిగా పేర్కొంటూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో తాత్కాలి గుడిసెలను తొలగించారు. గద్వాల డీఎస్పీ రంగస్వామి, శాంతినగర్ సిఐ శివశంకర్ గౌడ్, ఎస్‌ఐలు, 40 మంది పోలీసు బలగాలు, ఉండవెల్లి తహశీల్దార్ వీరభద్రప్ప, వీర్‌ఏలు, హౌసింగ్ బోర్డు ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈలు వెంకటేశ్వర్ రెడ్డి, సీరాజుద్దిన్, రమణ మూర్తి, శ్రీధర్ రెడ్డి, ఏఈఓ జగదీశ్వర్ రావుల అద్వర్యంలో ప్రక్రియ కొనసాగింది. విషయం తెలుసుకొని వచ్చిన రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు రామానందరెడ్డి, కార్యదర్శి వెంకటరమణ గౌడ్‌లను పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జాతీయరహదారికి పక్కన భారీగా పోలీసులు, అధికారులు ఉండటంతో ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికంగా కలకలం నెలకొంది.


తొలగించిన శిలాఫలకం


అలంపూర్ చౌరస్తాలో రంగస్థల కళాకారుల గుడిసెల వద్ద భారీగా పోలీసు బలగాలు

28 ఎకరాలు సేకరించిన హౌసింగ్ బోర్డు

అలంపూర్ చౌరస్తాలో హౌసింగ్ బోర్డు 28 ఎకరాల స్థలాన్ని సేకరించింది. అందులో రంగస్థల కళాకారులు కొనుగోలు చేసిన స్థలం ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అయితే, స్థల సేకరణ సమయంలో పట్టాదారులకు, రంగస్థల కళాకారులకు భూ వివాదం ఉండటంతో అవార్డును సివిల్ కోర్టులో జమ చేశారు. ప్రస్తుతం ఇద్దరి మధ్య ఒప్పందం కుదరడంతో మా స్థలం మాకే కావాలని రంగస్థల కళాకారులు కోరుతున్నారు. భూ సేకరణ పూర్తికావడంతో ఆ స్థలం హౌసింగ్ బోర్డు పరిధిలోకి వెళ్లింది.

న్యాయం చేయాలి



రంగ స్థల కళాకారులు వేసుకున్న గుడిసెలను సమాచారం ఇవ్వకుండా తొలగించడం సరికాదు. విషయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం. అధికారుల నుంచి స్పష్టమైన హామీ వస్తోందని భావించాం. కానీ ఎలాంటి భరోసా ఇవ్వకుండా గుడిసెలను తొలగించారు. జిల్లా అధికారులు రంగస్థల కళాకారులకు న్యాయం చేయాలి.

– రామానందారెడ్డి, రంగస్థల కళాకారుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

అన్యాయం చేస్తారనుకోలే..



ఇళ్ల స్థలాల కోసం 30ఏళ్లుగా పోరాటం చేశాం. అన్ని సమస్యలు అధిగమించిన తర్వాత హౌసింగ్ బోర్డు వాళ్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. రంగ స్థల కళాకారులకు ఇంతటి అన్యాయం జరుగుతుందని అనుకోలే.

– వెంకట్ రమణగౌడ్, రంగ స్థల కళాకారుల సంఘం నియోజకవర్గ కార్యదర్శి

అధికారుల ఆదేశాలతోనే..



అలంపూర్ చౌరస్తాలో 261 సర్వేనెంబర్‌లో రంగస్థల కళాకారులు గుడిసెలు వేశారు. ఈ స్థలం హౌసింగ్ బోర్డు పరిధిలోకి వస్తోంది. అయినప్పటికి గుడిసెలు వేయడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగించడం జరిగింది.

– వీరభద్రప్ప, తహశీల్దార్, ఉండవెల్లి

మధ్యాహ్న భోజనంలో పురుగులు

- నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులు
- వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో ఘటన


అన్నంలో కనిపిస్తున్న పురుగు

గండేడ్: మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీసిన ఘటన శనివారం వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. గండేడ్ మండల పరిధిలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉంది. ఇక్కడ 374 మంది విద్యార్థులున్నారు. ప్రతి నెలా మూడో శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం సమావేశానికి పలువురు తల్లిదండ్రులు వచ్చారు. సమావేశం ముగిశాక విద్యార్థులు తింటున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నంలో పురుగులున్నాయని ఓ విద్యార్థి జిన్నారం తండాకు చెందిన పాండుకు చెప్పాడు. తల్లిదండ్రులందరూ వెళ్లి 'పురుగుల అన్నం పెడితే పిల్లలు ఎలా తింటారు? మీ పిల్లలకు ఇలాగే పురుగుల అన్నం పెడతారా? అని వంట చేసే వారిని నిలదీశారు. విద్యార్థుల భోజనం విషయంలో ఉపాధ్యాయులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాల ప్రారంభం నుంచి అన్నం ఇలాగే ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలలో మండల, జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే సరైన భోజనం పెట్టడం లేని తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ విషయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్యను వివరణ కోరగా, అన్నంలో పురుగులొచ్చిన మాట నిజమేనని, వర్కర్లు ఎక్కువ లేకపోవడంతో ఇబ్బంది అవుతుందన్నారు. ఇటీవల ఏజెన్సీ వారితో మాట్లాడి ఒకరిని బియ్యం శుభ్రం చేసేందుకు పెట్టినా, పురుగులు వచ్చాయన్నారు. పురుగులు కంటికి సైతం కనిపించడం లేదన్నారు. ఇకముందు ఇలాంటి పరిస్థితి రాకుండా చూస్తామని హెచ్‌ఎం తెలిపారు.

మల్లెలకుంటను పరిశీలించిన అధికారులు


మట్టి వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశంతో మట్టి తొలగించేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

దేవరకద్ర రూరల్: జాతీయ రహదారి–167కు ఆనుకొని ఉన్న మల్లెల పాపయ్య కుంట చెరువును శనివారం అధికారులు పరిశీలించారు. 'రాత్రికి రాత్రే మల్లెలకుంట కబ్జా' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రవినాయక్ స్పందించారు. ఇందుకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు శనివారం దేవరకద్రలోని చెరువు లోపల మట్టి వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. మట్టి వేసిన ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు గుర్తించారు. మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈ చందు మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలకు తమ శాఖ అనుమతి ఇవ్వడం లేదన్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, వారి సూచనలతో తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి దుర్మరణం


విద్యుత్ స్తంభాల కింద ఇరుకున్న వారిని బయటకు తీస్తున్న ప్రయాణికులు

ఐదుగురికి గాయాలు


రాజు (ఫైల్)

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రం సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతిచెందగా.. అయిదుగురు గాయాలపాలైనట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని శేర్నపల్లికి చెందిన రాజు (28) ఎలక్ట్రీషియన్‌గా పని చేసేవాడు. శనివారం మధ్యాహ్నం మరో ఆరుగురితో కలిసి ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలు తీసుకొని మక్తల్‌కు బయలుదేరాడు. డ్రైవర్ గోవింద్ అజాగ్రత్తగా నడపడంతో సింగారం క్రాస్‌రోడ్డు దాటిన తర్వాత ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో స్తంభాలు వారిపై పడటంతో రాజు అక్కడికక్కడే మృతిచెందగా.. మిగిలిన వారికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న వారు బస్సు దిగి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రాజు భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ట్రాక్టర్ తిరగబడి యువకుడి మృతి


ప్రమాద స్థలంలో పైకి లేచిన ట్రాక్టర్ ఇంజన్


సతీష్(ఫైల్)

చారకొండ: ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం జూపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాత్క సతీష్ (30) తమ వ్యవసాయ పొలంలో గేదెల షెడ్డు నిర్మాణం కోసం సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రం నుంచి ట్రాక్టర్‌లో తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో మెయిన్‌రోడ్డు ఎక్కించే క్రమంలో మోరీ కాల్వ ఎత్తుండడంతో ట్రాక్టర్ ఇంజన్ పైకి లేచి వెనక్కి తిరగబడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న సతీష్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఇరుక్కుపోయి తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వెల్దండ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. అతనికి గతేడాది వివాహమైంది. భార్య అనిత, బాలుడు ఉన్నారు.

మామపై అల్లుడు దాడి

చికిత్స పొందుతూ మృతి


లక్ష్మప్ప మృతదేహం

మక్తల్ : సొంత మామను అల్లుడు కట్టెతో దాడి చేసిన ఘటన మక్తల్ మండలం పస్పుల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పస్పుల గ్రామానికి చెందిన లక్ష్మప్ప(44)కు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దకూతురు రేణుకకు జడ్చర్ల మండలం ఆలూర్‌కు చెందిన గోపి మల్లేష్‌ను ఇల్లరికం తెచ్చుకున్నారు. ఇంటి పనుల విషయంలో అప్పుడప్పుడు మామ అల్లుడికి గొడవలు అవుతుండేవి. శుక్రవారం పొలం దగ్గర పని సరిగ్గా చేయడం లేదని మామ గద్దించాడు. దీంతో గోపి మల్లేష్ కోపంలో కట్టెతో మామ తలపై గట్టిగా కొట్టాడు. శరీరంపై, తలకు బలమైన గాయాలుకావడంతో వెంటనే మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి లక్ష్మప్ప శనివారం మృతిచెందాడు. అతని బామ్మర్ది నర్సింహులు ఫిర్యాదు మేరకు గోపి మల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

నర్సుల పాత్ర కీలకం

- రోగికి రక్షణ ప్రమాణాలు పాటించాలి
- డాక్టర్ విజయ్ ఎల్దండి


డాక్టర్ విజయ్ ఎల్దండిని సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ క్రైం : ఆస్పత్రుల్లో రోగులకు ఇన్ఫెక్షన్ కాకుండా రక్షణ చర్యలు కల్పించడం, ఇతర వ్యాధులు సోకకుండా ఉంచడంలో నర్సుల పాత్ర కీలకమని డాక్టర్ విజయ్ ఎల్దండి అన్నారు. ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తే ఆస్పత్రుల్లో ఇన్ఫెక్షన్ శాతం తగ్గించవచ్చని ఆయన తెలిపారు. ఆపరేషన్ థియేటర్స్‌ను నిత్యం శుభ్రంగా ఉంచాలని, సర్జరీల తర్వాత తొలగించిన వాటిని సురక్షితంగా భద్రపరచాలన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సూపరింటిండెంట్ డాక్టర్ రాంకిషన్ అధ్యక్షతన శనివారం 'రోగి రక్షణ– ఇన్ఫెక్షన్ కంట్రోల్' అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదట ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యుల ఎప్పుడూ రోగులతో ప్రేమగా మాట్లాడాలని, ఏదైనా సర్జరీ చేసే క్రమంలో, ఓపీ చూసే సమయంలో రోగికి రక్షణకు సంబంధించిన ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పద్మ, మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేష్, డాక్టర్ జీవన్, హెచ్‌వోడీలు రమాదేవి, నవల్ కిషోర్, హనుమంతుప్రసాద్, అమరావతి, గీతా మీనాక్షి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

మరో డ్రైవర్‌కు గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ క్యాబిన్


స్వల్ప గాయాలతో మరో డ్రైవర్ పొన్నుస్వామి

అడ్డాకుల: మండలంలోని జాతీయ రహదారిపై కాటవరం స్టేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం చెందాడు. మరో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం... తమిళనాడులోని నమ్మకల్ జిల్లా పరమతి వేశూర్ తాలూకా కున్నతూర్‌పా గ్రామానికి చెందిన కె.పెరియస్వామి(48), పొన్నుస్వామి లారీడ్రైవర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరు కలిసి కేరళ నుంచి బ్యారల్ తయారు చేసే రబ్బరు లోడ్‌తో హరిద్వార్ బయలుదేరారు. నెల్లూరు నుంచి కర్నాటకలోని సేడంకు బొగ్గు లోడ్‌తో మరోలారీ బయలుదేరింది. శనివారం మధ్యాహ్నం అడ్డాకుల దాటిన తర్వాత కాటవరం తండా స్టేజీ ఎదురుగా ముందు వెళ్తున్న బొగ్గు లారీని, వెనుక రబ్బరు తీసుకెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో రబ్బరు లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ పెరియస్వామి క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. క్యాబిన్‌లోనే నిద్రిస్తున్న మరో డ్రైవర్ పొన్నుస్వామి కూడా క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. స్థానికులు, పోలీసులు కలిసి క్యాబిన్‌లో ఇరుక్కున్న వారిని అతికష్టం మీద బయటకు తీసి 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ పెరియస్వామిని కాపాడేందుకు అంబులెన్స్ సిబ్బంది సీపీఆర్ చేసి ప్రయత్నించినా ఆస్పత్రికి వెళ్లేలోపే ప్రాణాలు వదిలాడు. మరో డ్రైవర్ పొన్నుస్వామి స్వల్పగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోడ్డుపై నిలిచిన లారీని రెండుగంటల పాటు శ్రమించి పోలీసులు క్రేన్, జేసీబీ సాయంతో పక్కకు తీయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని రాం నగర్ కాలనీలో బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వినయ్ అనే బాలుడు పిల్లలు కలిసి కాలనీలో ఆడు తున్నాడు. అకస్మత్తుగా కుక్కలు వినయ్‌పై దాడి చేశాయి. బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సేల్స్ ప్రమోటర్స్ కావలెను

మీ సొంత జిల్లాలలో 'సాక్షి' దినపత్రికకు చందాదారులను చేర్పించడానికి చొరవ, ఉత్సాహం కలిగిన యువతీ యువకులకు ఆహ్వానం. ఉద్యోగంలో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు ఉంటాయి.

అర్హతలు: 10th లేదా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 19- 35 ఏళ్ల మధ్య ఉండాలి. తెలుగులో స్పష్టంగా మాట్లాడాలి. స్థానికులై ఉండాలి. ఉద్యోగరీత్యా అవసరమైనప్పుడు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది.

ఇంటర్వ్యూ: 19-07-2023 బుధవారం ఉదయం 11 గం॥ల నుండి మధ్యాహ్నం 2 గం॥ల వరకు.

ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లతో ఈ క్రింది అడ్రస్ నందు సంప్రదించగలరు.

సాలరీ : 15000/-

నోట్ : తప్పనిసరిగా ఆన్‌డ్రాయిడ్ ఫోన్ కలిగి ఉండవలెను.

సాక్షి యూనిట్ కార్యాలయము : అమిస్తాపూర్ గ్రా॥, భూత్పూర్ మం॥, మహబూబ్‌నగర్ జిల్లా సెల్ : 9182788896

సాక్షి క్లాసిఫైడ్స్

MISSING

The General Public is hereby informed that Kum.Rebecca Vangore, D/o. Vangore Donald, R/o. H.No.2-2-150/1, Mission Compound, Mahabubnagar Town and District, Telangana State, has been lost her Passport bearing No.E6935047 on 17-03-2023 while she was travelling from her home i.e., Mission Compound to Passport office, Mahabubnagar, she made searches to trace out the same, but in vain, If the said Passport traced to any person, please bring the same to the above address and handover to her.

EDUCATION

■ ఫైనల్‌లో మార్చి ఎగ్జామ్స్‌కు అడ్మిషన్స్ కలవు. 100% పాస్ గ్యారెంటీ. కొద్ది సీట్లు మాత్రమే. డైరెక్ట్ SSC, వన్ సిట్టింగ్ ఇంటర్, Any డిగ్రీ, Any పీజీ, D. ఫార్మసీ, B.Ed., B.Tech. హైదరాబాద్. సెల్ : 8309624934

SERVICES

■ మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541

NAME CHANGE

■ CHGULLAPALLI KRISHNAVENI గా ఉన్న నా పేరు CHIGULLAPALLI KRISHNAVENI W/o VENKATESHAM CHIGULLAPALLI R/o H.No.9-71, Christianpali, MBNR గా మార్చబడినది గమనించగలరు.

■ G.SHIVANI D/o G.MAHESHWAR గా ఉన్న నా పేరు GUNDLURU SHIVANI D/o GUNDLURU MAHESHWAR R/o Gadwal గా మార్చబడినది గమనించగలరు.

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 8వ లైన్, NR పేట, కర్నూలు. 08518 - 228666, 83412 98666

సాక్షి భవిత విద్యార్థుల కోసం

GYNECOLOGY

■ కార్తిక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతీ దేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, భార్యభర్తలు, డ్రైవర్స్ కావలెను. Ph: 9391036931, 9246585901

■ మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం: 12000/- ఉచిత వసతి భోజనం. ఫోన్ : 6300661014

■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీలో పనిచేయుటకు 39 స్త్రీ/పు కావలెను. జీ. 14 వేలు+6 వేలు DA + ఫ్రీ రూం, భోజనం కలదు. Q:10th,Degree,ITI, డిప్లొమా (P/F) మహబూబ్‌నగర్. 85198 91505

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం) HAPPY BIRTHDAY

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

మరో 23మంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఆదేశాల నేపథ్యంలో వరుసగా రెండో రోజూ పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేశారు. 23 మందిని బదిలీ చేసి అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలుగా పోస్టింగులివ్వగా, మరో 9 మందిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు.

43 మంది డీఎస్పీలకు స్థానచలనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 43 మంది డీఎస్పీల(సివిల్)ను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

22 మంది మునిసిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ పురపాలక సంస్థల్లో పనిచేస్తున్న 22 మంది మునిసిపల్ కమిషనర్లను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ కార్యదర్శి సి.సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి పాత పింఛన్ సాధన రథయాత్ర: స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం నుంచి పాత పింఛన్ సాధన సంకల్ప రథ యాత్ర నిర్వహించనున్నట్టు తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఈ యాత్ర సాగుతుందని, ఆదివారం జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రం నుంచి ప్రారంభమై ఈనెల 31న యాదాద్రి నరసింహుని సన్నిధిలో ముగుస్తుందని శనివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సామాజిక భద్రతను కల్పించే పాత పింఛన్ ఆవశ్యకతను తెలియజెప్పడంతోపాటు పాత పింఛన్ అమలు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ యాత్ర చేపడుతున్నామని తెలిపారు. తమ డిమాండ్‌కు ఇప్పటికే టీజీవో, టీఎన్జీవో సహా పలు సంఘాలు మద్దతిచ్చాయని, పాత పింఛన్ పొందుతున్న ఉద్యోగులు కూడా ఈ యాత్రకు మద్దతివ్వాలని కోరారు. కంట్రిబ్యూటరీ పింఛన్ విధానం రద్దుతో రాష్ట్రంలోని 1.72 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు సామాజిక భద్రత చేకూరుతుందన్నారు.

బాత్రూమ్‌లో బీ కేర్‌ఫుల్

ఇళ్లలో రెండో అత్యంత ప్రమాదకర ప్రదేశం

- అనేక మంది ప్రముఖులు బాత్రూమ్ ప్రమాదాల్లోనే మృతి
- ప్రమాదాల బారిన పడుతున్న వారిలో 60 ఏళ్లు దాటిన వారే ఎక్కువ



సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఏటా 15 ఏళ్లు పైబడిన వారిలో 2.35 లక్షల మంది బాత్రూమ్‌లో గాయపడుతున్నారని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక చెబుతోంది. ఇంట్లో అతి చిన్న గదే అయినప్పటికీ.. వంటగది తరువాత బాత్రూమ్ అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం. బాత్రూమ్‌లో సంభవించే ప్రమాదాల కారణంగా ఒక్క యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలోనే నిత్యం 347 మంది మరణిస్తున్నారు. మన దేశంలో ఎముకల చికిత్స కోసం వెళుతున్న వారిలో దాదాపు 35నుంచి 45 శాతం మంది బాత్రూమ్‌లో జారిపడి గాయాల పాలైనవారే. ప్రముఖ సినీ నటి శ్రీదేవి దగ్గర్నుంచి తాజాగా చైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు వరకూ అనేక మంది ప్రముఖుల మరణాలు బాత్రూమ్‌లోనే సంభవించాయి.

ఈ జాగ్రత్తలు పాటించాలి

వదులుగా ఉన్న టాయిలెట్ బౌల్ రిమ్‌పై కూర్చోవడం వల్ల అది అటూ ఇటూ కదిలి శరీరానికి గాయం చేయవచ్చు. ప్లాస్టిక్ సీట్లు పగిలిపోవడం, వ్యక్తి బరువు వల్ల కూలిపోవడం కూడా గాయాలు కలిగించవచ్చు. టాయిలెట్లలో సిగరెట్లు వంటివి పడేయడం వల్ల అవి పేలిపోయే ప్రమాదం కూడా ఉంది. కోసుకుపోవటం, ఎముకలు విరగటం, వెన్నెముకకి గాయాలు, ఫ్రాక్చర్లు, వంటివి మామూలే. సాధారణంగా బాత్రూమ్ ప్రమాదాలు మనం టబ్‌లోంచి బయటకు వస్తున్నప్పుడో, టాయిలెట్ సీటుపై కూర్చున్నప్పుడో, తువ్వాలు తీసుకుంటున్నప్పుడో లేదా జారుడు నేలపై నడిచినప్పుడో జరుగుతాయి. ఇలాంటివి ఆపాలంటే బాత్రూమ్ వాడుతున్నప్పుడు లైట్లు, డోర్ మ్యాట్లు వేయాలి. బాత్రూమ్ నేలను పొడిగా ఉండేలా చూసుకోవడంతో పాటు, పట్టుకోడానికి హ్యాండిల్స్ పెట్టించాలి. పాశ్చాత్య టాయిలెట్‌లో కూర్చుని లేచే సమయంలో హేండిల్ పట్టుకుని లేవాలి. బాత్రూమ్‌కి వెళ్లినప్పుడు లోపల గట్టిగా గడియపెట్టుకోవకపోవడం వృద్ధులకు మంచిది. షవర్ కింద స్నానం చేసే సమయంలో స్టూల్ వాడాలి. చల్లని నీటితో స్నానం చేసినప్పుడు ముందుగా తలపై కాకుండా పాదాలపై నీటిని పోసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

చరిత్రలో కొన్ని దుర్ఘటనలు

- చైనాలోని జిన్ రాష్ట్ర పాలకుడు క్రీస్తు పూర్వం 581లో టాయిలెట్ పిట్‌లో పడి మరణించాడు.
- చరిత్రలో మర్చిపోలేని దుర్ఘటన ఒకటి 1184న జూలై 26న సంభవించింది. ‘ఎర్ఫర్ట్ లెట్రిన్ విపత్తు’గా పిలిచే ఈ ప్రమాదం రోమన్ చక్రవర్తి హెన్రీ అనధికార సమావేశం నిర్వహిస్తుండగా.. దానికి హాజరైన వారి బరువు కారణంగా చెక్క భవనం రెండవ అంతస్తు నేల కూలిపోయింది. కొంతమంది గ్రౌండ్ ఫ్లోర్ కింద ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో పడి మునిగిపోవడంతో 60 మంది మరణించారు.
- 1760లో గ్రేట్ బ్రిటన్‌కు చెందిన కింగ్ జార్జ్ అక్టోబర్ 25న టాయిలెట్‌లో మరణించాడు.
- 1945లో జర్మన్ జలాంతర్గామి ఒక టాయిలెట్ ప్రమాదంలో మునిగిపోయింది.
- 1983 జూన్ 2న ఎయిర్ కెనడా విమానం –797 వెనుక లావెటరీలో మంటలు చెలరేగి విమానం మొత్తం కాలిపోయింది. ప్రమాదంలో 23 మంది మరణించారు.
- బ్రిటిష్ వ్యాపారవేత్త, కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు క్రిస్టోఫర్ షేల్ జూన్ 26, 2011న గ్లాస్టన్‌బరీ ఫెస్టివల్‌లో పోర్టబుల్ టాయిలెట్‌లో గుండెపోటుతో చనిపోయాడు.
- టాయ్‌లెట్ల ఫిట్టింగ్‌లు సరిగ్గా లేకపోవడం వల్ల ఏటా దాదాపు 10 వేల ఓడలు ప్రపంచవ్యాప్తంగా మునిగిపోతున్నాయి.

అప్రమత్తంగా ఉండండి



‘బాత్రూమ్’ మరణాల్లో ఎక్కువ శాతం హార్ట్ అటాక్ వల్లే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం చల్లని నీటితో తలస్నానం చేసినప్పుడు.. ఆ నీటిని తలపై పోసుకుంటే శరీరంలో ఆ భాగం చల్లగా మారుతుంది. దీంతో రక్తనాళాలు వెంటనే అలర్ట్ అయ్యి రక్తాన్ని ఒక్కసారిగా పైకి పంపిస్తాయి. దీనివల్ల తల భాగం వైపు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా ఒక్కసారిగా బ్లడ్ ప్రెషర్ పెరిగి హార్ట్ అటాక్ వస్తుంది. కొన్నిసార్లు పక్షవాతం కూడా రావచ్చు. జారి పడిపోయినప్పుడు తల నరాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. వెన్నుపూస కూడా విరగవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ సుధాకర్ కనపర్తి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణుడు, విజయవాడ

వృద్ధుల ప్రాణాలు తీస్తున్నాయ్

ఇంట్లో 65 ఏళ్లు పైబడిన పెద్దవారు ఉంటే.. బాత్రూమ్ ప్రమాదాల గురించి కచ్చితంగా తెలుసుకోవాలి. ప్రతి నలుగురిలో ముగ్గురు వృద్ధులు ఏడాదికి ఒకసారైనా బాత్రూమ్‌లో జారిపడే అవకాశం ఉంది. ఈ ప్రమాదాల్లో 65 శాతం చిన్న గాయాలతో సరిపెట్టినా.. మిగతా 35 శాతం మాత్రం ప్రాణాలు తీస్తున్నాయి. మన దేశంలో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలో 42 శాతం మంది టాయిలెట్లలో 7 నుంచి 10 సార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. 58 శాతం మంది 11 నుంచి 15 సార్లు పడిపోతున్నారు. సరైన తలుపులు లేకపోవడం ప్రమాదానికి వంద శాతం కారణమవుతుండగా, జారే ఫ్లోర్ 91.9 శాతం, బాత్రూమ్ పరిమాణం 80.3 శాతం, ఎత్తైన తలుపు థ్రెషోల్డ్ 53.5 శాతం, నాన్-స్కిడ్ మ్యాట్ లేకపోవడం 99.5 శాతం, గ్రాబ్ బార్‌లు లేకపోవడం 97 శాతం, ఎగ్జాస్ట్ ఫ్యాన్ లేకపోవడం 96.6 శాతం, బాత్రూమ్‌లో వెలుతురు సరిపోకపోవడం వల్ల 94.4 శాతం



ప్రమాదాలు జరుగుతున్నాయి. వేడి నీటి వినియోగం 89.9 శాతం, సీట్ ఉపరితలం 55.6 శాతం, ప్రవేశ ద్వారం వద్ద లైట్ స్విచ్ లేకపోవడం 53 శాతం, చిందరవందరగా ఉన్న మార్గం వంటివి 39.4 శాతంకారణమవుతున్నాయి. ఎన్‌సీబీఐ మార్కెటింగ్ ఏజెన్సీ నివేదిక ప్రకారం.. 11 శాతం హార్ట్ అటాక్‌లు బాత్రూమ్‌లోనే వస్తున్నాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు లేదా స్నానం చేస్తున్న సమయంలో ఇవి సంభవిస్తున్నాయి.

ఆస్ట్రేలియాకు మేడిన్ ఏపీ ఈ–స్కూటర్లు

- కాన్‌బెర్రాకు ఎగుమతి చేయనున్న అవెరా సంస్థ
- పైలట్ ప్రాజెక్టు కింద తొలుత 100 ఈ–స్కూటర్ల ఎగుమతి



సాక్షి, అమరావతి: ఆస్ట్రేలియా రోడ్లపై మేడిన్ ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ స్కూటర్లు దూసుకుపోనున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నున్న సమీపంలోని విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ‘అవేరా’తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆస్ట్రేలియాలో అడుగుపెడుతోంది. కాన్‌బెర్రా రాష్ట్రానికి పైలట్ ప్రాజెక్టు కింద 100 ఎలక్ట్రిక్ స్కూటర్లను అవేరా సంస్థ ఎగుమతి చేయబోతోంది. ఈ విషయాన్ని అవేరా వ్యవస్థాపక సీఈవో డాక్టర్ వెంకటరమణ ‘సాక్షి’కి తెలిపారు. ఇటీవల ప్రధాని మోదీ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా.. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై చర్చలు జరిగాయని చెప్పారు. ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసే ఎలక్ట్రిక్ స్కూటర్లపై సుంకాలు, పన్నులు విధించకుండా భారత్ ప్రభుత్వం త్వరలో ఒప్పందం కుదుర్చుకుంటుందన్నారు. ఆస్ట్రేలియాలో ఈ–స్కూటర్లను ప్రోత్సహించడానికి కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ ముందుకు వచ్చారని తెలిపారు. తొలుత విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం అవేరాకు చెందిన 100 విన్సిరో ఈ–స్కూటర్లను సరఫరా చేయాలని ఆయన కోరినట్లు వివరించారు. కాన్‌బెర్రా సీఎం ఆండ్రూ భారత్ పర్యటనలో భాగంగా వచ్చే ఏడాది ఏపీకి వస్తారని, ఆ సమయంలో దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు.

బోరుబావి నుంచి అగ్నికీలలు

మధ్యాహ్నానికి ఆగిపోయిన గ్యాస్.. మంటలు



బోరుబావి నుంచి ఎగసిపడుతున్న అగ్నికీలలు

రాజోలు: ఆక్వా చెరువుకు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న 280 అడుగుల లోతు బోరుబావి నుంచి గ్యాస్ భూ ఉపరితలం పైకి వచ్చి అగ్నికీలలు ఎగసి పడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటి గ్రామంలోని మట్టపర్రు రోడ్డులో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. మట్టపర్రు రోడ్డులో ఆక్వా చెరువులకు నీటి కోసం రైతులు నాలుగేళ్ల కిందట బోరుబావి తవ్వారు. శ్రీనివాస్ అనే రైతు ఈ బోరుబావి నుంచి తన చెరువులోకి నీటిని తోడుతున్నాడు. బోరుబావి నుంచి శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా గ్యాస్ పైకి రావడంతోపాటు మంటలు ఉధృతంగా ఎగసిపడ్డాయి. ఆక్వా రైతులు ఓఎన్జీసీ, రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఓఎన్జీసీ, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని బోరు బావి నుంచి గ్యాస్ వస్తుందని, బావి అడుగున ఉన్న విద్యుత్ మోటారులో సాంకేతిక లోపంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు ఎగసిపడుతున్నాయని నిర్ధారించారు. మధ్యాహ్నానికి గ్యాస్ పైకి రావడం ఆగిపోయింది. దీంతో మంటలు కూడా ఆగిపోయాయి. అనంతరం వెంటనే ఓఎన్జీసీ, రాజోలు అగ్నిమాపక సిబ్బంది కలసి ఇసుక, నీటితో బోరుబావిని పూర్తిగా పూడ్చివేశారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలకు చెందిన పైప్‌లైన్లు ఆ ప్రాంతంలో లేవని, అయినప్పటికీ ఈ బోరుబావి నుంచి గ్యాస్ ఎలా వచ్చిందనే విషయాన్ని పరిశీలిస్తామని ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

‘చైతన్య’ బీఎస్ రావుకు కన్నీటి వీడ్కోలు



బీఎస్ రావు అంతిమయాత్ర దృశ్యం

పెనమలూరు: శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావుకు శనివారం కన్నీటి వీడ్కోలు పలికారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం తాడిగడప శ్రీచైతన్య క్యాంపస్ నుంచి ప్రత్యేక వాహనంలో ఆయన భౌతికకాయాన్ని బందరు రోడ్డు మీదుగా గోసాల క్యాంపస్ వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమ మజిలీలో కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు, శ్రీచైతన్య విద్యాసంస్థల సిబ్బంది, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఎస్ రావుకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గోసాల వ్యవసాయ క్షేత్రంలో బీఎస్‌రావు భౌతిక కాయానికి అంత్యక్రియలు పూర్తి చేశారు.

త్వరలోనే కేంద్ర బృందాల రాక



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సర్వసర్వేక్షణ్–23లో భాగంగా ‘సిటిజన్ ఫీడ్ బ్యాక్’పై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ పట్టణంలో ఇంటింటికీ తిరిగి ప్రజల నుంచి అభిప్రాయాలను నమోదు చేయించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కోసం త్వరలోనే ఓడీఎఫ్, జీఎఫ్‌సీ కేంద్ర బృందాలు మహబూబ్‌నగర్ రానున్నాయన్నారు. అప్పటిలోగా వీలైనంత ఎక్కువ మందితో స్వచ్ఛ యాప్‌ను డౌన్‌లోడింగ్ చేయించి, వివరాలు పూర్తి చేయించాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణికుమారి, డిప్యూటీ ఈఈ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తోడళ్లుళ్ల మృతి

- బైక్‌ను ఢీకొట్టిన క్రూజర్
- అక్కడికక్కడే ఒకరు.. ఆస్పత్రిలో మరొకరు మృత్యువాత

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రం వద్ద శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో తోడళ్లులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన నారోజ్ శాల్వాచారి(45), మహబూబ్‌నగర్ జిల్లా మణిగల్ల గ్రామానికి చెందిన వీరబ్రహ్మచారి(50) తోడళ్లుల్లు వీరు నరగంలో ఉంటూ కార్పెంటర్లుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం మధ్యాహ్నం బైక్‌పై తిరుగండ్లపల్లికి వచ్చారు. తిరిగి హైదరాబాద్ వెళ్తుండగా రాత్రి 8 గంటల సమయంలో బైక్‌పై మాల్ కేంద్రం దాటుతున్న సమయంలో యాచారం వైపు నుంచి ఎదురుగా వచ్చిన వచ్చిన క్రూజర్ వాహనం వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన వీరబ్రహ్మచారి అక్కడికక్కడే మృతి చెందగా.. తీవ్ర గాయాలైన శాల్వాచారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాములను బతకనిద్దాం

- జీవవైవిధ్య పరిరక్షణలో పాములది కీలకపాత్ర
- ఉమ్మడి జిల్లాలో 37 రకాల సర్పాలు
- ఏబీసీడీ సంస్థ ద్వారా పరిశోధన, అవగాహన
- నేడు ప్రపంచ పాముల దినోత్సవం



శివుడికే కాదు మాకు పాము ఆభరణమే అంటూ పామును మెడలో వేసుకున్న అధ్యాపకురాలు

జడ్చర్ల టౌన్: జీవవైవిధ్య పరిరక్షణలో పాములది కీలక పాత్రగా చెప్పుకోవచ్చు. హిందువులు పాములను పూజించడం చూస్తుంటాం. అదే పాము ఎదురుపడితే వెన్నులో వణుకు పుడుతుంది. అయితే ప్రపంచంలో 3,500 రకాల పాములు ఉండగా.. వాటిలో 600 మాత్రమే విషసర్పాలు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 37 రకాలు ఉండగా.. 6 మాత్రమే విషసర్పాలు, 6 అర్ధరహిత విషసర్పాలు, మిగిలిన 27 విషరహిత సర్పాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో నాగుపాము, కట్లపాము, చిన్న పింజరి, రక్తపింజరి, వెదురు పింజరి, కోరల్ స్నేక్ వంటి 6 రకాల విషసర్పాలున్నాయి. వీటిలో వెదురు పింజరి, కోరల్‌స్నేక్ రెండు నల్లమల అటవీ ప్రాంతంలో మాత్రమే సంచరిస్తుంటాయి. ఆదివారం (జూలై 16) ప్రపంచ పాముల దినోత్సవంగా ప్రత్యేక కథనం..

విరివిగా పరిశోధనలు..

ఏబీసీడీ సంస్థ ద్వారా జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్య జీవవైవిధ్య పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయం. అందులో భాగంగానే 2012లో ఏబీసీడీ (అసోసియేషన్ ఫర్ బయో డైవర్సిటీ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్) సంస్థను స్థాపించారు. సంస్థ ద్వారా పాముల సంరక్షణలో శిక్షణ ఇస్తున్నారు. పట్టుకున్న పాములు గుడ్లు పెట్టినట్లయితే ఆ గుడ్లను సురక్షితంగా అటవీ శాఖకు అనుబంధంగా ఉన్న హైదరాబాద్ ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సంస్థకు అప్పగిస్తారు. ఆ సంస్థ గుడ్లను హ్యాచింగ్ ద్వారా పిల్లలు పుట్టించేలా చేస్తారు. పాములపై పరిశోధనలు సైతం ప్రారంభించారు.



ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలో పాముకాటు వల్ల 600 నుంచి 650 వరకు మరణాలు జరుగుతున్నాయి. అయితే పాముకాటుకు గురవుతున్న వారిలో రైతులే అధికంగా ఉన్నారు. అవగాహన లేక పాముకాటు వల్ల మరణిస్తున్న వారి సంఖ్య సైతం అధికంగానే ఉంది. ఎక్కువ మరణాలు కట్లపాము వల్లే సంభవిస్తాయి. కట్లపాము కరిచినప్పుడు విషంతోపాటే నొప్పికలగకుండా ఒకరకమైన ఆమ్లాలు విడుదలవుతాయి. అందువల్ల పాము కరిచినట్లు ఏమాత్రం సందేహం కలగదు. 3 గంటల తర్వాత మాత్రమే వాంతులు, జ్వరం, నొప్పులు వస్తాయి. సకాలంలో ఆస్పత్రికి వెళ్లకపోవడం, నాటువైద్యులను ఆశ్రయించడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయి.

అందుబాటులో స్నేక్‌క్యాచర్స్



‘బతుకుదాం బతకనిద్దాం’ అన్న నినాదంతో సృష్టిలోని ప్రతి ప్రాణికి బతికే హక్కు కల్పించాలి. నాతో శిక్షణ పొందిన 100 మంది స్నేక్ క్యాచర్స్ రాష్ట్రవ్యాప్తంగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 7,200 పాఠశాలల్లో పాముల గురించి అవగాహన కల్పించారు. 12 వేల పాములను ఆయా ప్రాంతాల్లో పట్టుకుని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాం. ఎక్కడైనా పాములు కనబడితే వాటిని చంపకుండా సమాచారం ఇస్తే పట్టుకు వెళ్తాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా స్నేక్ క్యాచర్స్ అందుబాటులో ఉన్నారు.

– సదాశివయ్య, సర్పరక్షకుడు, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పర్యావరణానికి ఎంతో మేలు..

పాముల వల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుంది. పంట పొలాలను నాశనం చేసే ఎలుకలు, కీడు చేసే క్రిమికీటకాలను పాములు తింటాయి. దీని వల్ల పంటలు నాశనం కాకుండా ఉంటాయి. ఈ క్రమంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం జడ్చర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గీతాశ్రీ హైస్కూల్‌లో పాముల పట్ల ఏబీసీడీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. విద్యార్థులతో పాములు పట్టించి వారిలో ఉన్న భయాన్ని పోగొట్టారు.

రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ



మోతీఘణాపూర్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్ రెడ్డి

- ఏడాదికి రూ.15 వేలు రైతుబంధు ఇస్తాం
- పాదయాత్రలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

బాలానగర్ : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మాయమాటల వల్ల రైతులు బ్యాంకుల్లో భార్యల పుస్తెలు తాకట్టు పెట్టి రుణాలు కడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకే సారి రెండులక్షల రుణాలు మాఫీ చేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మండల పరిధిలోని మేడగడ్డ తండా నుంచి ప్రారంభమైన ప్రజాహిత పాదయాత్ర మేతీఘణపూర్, నందారం, కుషన్‌గూడ తండా, పంచాంగులగడ్డ తండాల మీదుగా జాలుగడ్డ తండాకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్‌ను ఐదు వందలకే ఇస్తామని, రైతుబంధు ఏడాదికి రూ.15 వేలు అందిస్తామన్నారు. కౌలు రైతులకు రూ.12 వేలు అందజేస్తామన్నారు. పరిశ్రమల్లో 75 శాతం స్థానికులకు ప్రాధాన్యం కల్పిస్తమన్నారు. 57 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరికీ రూ.4 వేల పింఛన్ అందిస్తామన్నారు.

కేసీఆర్ హామీలలో అంతా మోసమే..

కేసీఆర్ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని, బ్యాంకుల్లో రైతులు రుణాలు కట్టకపోతే బ్యాంకు అధికారులు ఖాతాలను సీజ్ చేశారని అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఇంటికో ప్రభుత్వ ఉద్యోగమని, పేదలకు రెండు పడకల ఇళ్లు ఇస్తామని కేసీఆర్ మోసం చేశారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓట్లతో గద్దెదించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం..

కేసీఆర్ పాలనలో భూ దోపిడీ, భూ కబ్జాలే అధికంగా ఉన్నాయన్నారు. బాలానగర్ మండల కేంద్రంలో ఆదివారం భూ కబ్జాదారుల చరిత్ర బయటపెడతానని అనిరుధ్‌రెడ్డి అన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే..

నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతి గ్రామానికీ వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అనిరుధ్‌రెడ్డి అన్నారు. చదువుకునే కాలేజీ బాలికలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. భూ సమస్యలను అధికారులే గ్రామాలకు వచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బూట్లు, సాక్స్ అందిస్తానన్నారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మాట తప్పితే తనను గ్రామాల నుంచి తరిమికొట్టండి అని ఉద్వేగంగా అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు అరుణ్ కుమార్ రెడ్డి, బాబ్య, రాజేశ్వర్ రెడ్డి, రఫీక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ బరిలో ఉంటా..


- కృష్ణానది నీళ్లు వాడుకునే తెలివి బీఆర్‌ఎస్‌కు లేదు
- కేసీఆర్ అవినీతి నిరూపించి జైలుకు పంపిస్తా
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నాగం

జడ్చర్ల సెంటర్ (మహబూబ్‌నగర్): నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీ చేసేందుకు తాను బరిలో ఉంటానని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఆయన డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే స్థానం నుంచి ఈ సారి పోటీ చేస్తారా? అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు పైవిధంగా సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యే టిక్కెట్ అడిగినా బరిలో కచ్చితంగా ఉంటానని అన్నారు. కృష్ణానదిలో 574 టీఎంసీల నీళ్ల వాట ఉన్నా, వాడుకునే తెలివి కేసీఆర్‌కు లేదని ఆరోపించారు. కేసీఆర్ అసమర్థ పాలన వల్ల పాలమూరుకు దక్కాల్సిన కృష్ణ నీళ్లు రాయలసీమకు దోచిపెడుతున్నాడని పేర్కొన్నారు. రాయలసీమకు కృష్ణ నీళ్లు కేసీఆర్ అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. కృష్ణానదికి 299 టీఎంసీల నీళ్ల కోసం కేసీఆర్ సంతకం చేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో ఒక్క బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అయిన కట్టారా? అని నిలదీశారు. కరెంట్‌పై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల రిడిజైన్‌పేరుతో కేసీఆర్ 5,580 వేల కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 6, 8, 10, 11 ప్యాకేజీల్లో అవినీతిపై సుప్రీం కోర్టులో కేసు నడుస్తుందని, ఆ తీర్పు వచ్చిన వెంటనే కేసీఆర్‌ను జైలుకు పంపించడం ఖాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు సిరాజ్‌ఖాద్రి, అనిత, బెనహర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం తెచ్చే దాక పోరాటం



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

జడ్చర్ల సెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిని అమలుచేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే దాకా పోరాటం చేస్తామన్నారు. తమ పోరాటానికి వివిధ ఉద్యోగ సంఘాలు మద్దతు తెలుపుతున్నారన్నారు. పాత పెన్షన్ సాధన కోసం సంకల్ప రథయాత్ర ప్రారంభించనున్నట్లు వివరించారు. ఆదివారం అలంపూర్ నుంచి ఈ యాత్ర ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి.. 31న ముగుస్తుందని చెప్పారు. యాత్ర విజయవంతం అయ్యేందుకు ఆయా శాఖల ఉద్యోగులను కలిసి ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చేనెల 12న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, కోశాధికారి రాఘవేంద్ర, కృష్ణకుమార్‌గౌడ్, గోవర్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.